www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
18.01.2024
సంపుటి:2 సంచిక: 88

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ చేయలేను

- ఆ కేసు కోర్టులో పెండింగ్ లో ఉంది
- కోర్టు తీర్పు వచ్చాకే నిర్ణయం
- గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్

మిగతా 2లో



# బిగ్ డీల్స్!

## దావోస్‌లో తెలంగాణకు పెట్టుబడుల వరద..

- ఇన్వెస్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశాలు
- వేల కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు కంపెనీల ఎంవోయూ
- రాష్ట్రంలో అదానీ గ్రూప్ భారీగా పెట్టుబడులు..
- రూ. 12, 400 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్న అదానీ గ్రూప్
- రూ.9,000 కోట్లతో జేఎస్ డబ్ల్యూ కూడా అంగీకారం..
- రూ. 8,000 కోట్లు పెట్టేందుకు 'గోడీ ఇండియా' ఒప్పందం
- లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించేలా ప్రాజెక్టుల విస్తరణ

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు (డబ్ల్యూఈఎఫ్)లో తెలంగాణకు భారీ పెట్టుబడుల వరద కొనసాగుతోంది. అదానీ గ్రూప్ తెలంగాణలో అధిక వ్యాపారాల ద్వారా రూ.12,400 కోట్ల పెట్టుబడిని ప్రకటించినట్లు తెలంగాణ ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ లో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీతో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడుల కోసం అదానీ గ్రూప్ రాష్ట్ర ప్రభుత్వంతో నాలుగు ఎంవోయూలను కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం, అదానీ గ్రీన్ ఎనర్జీ 1350 మెగావాట్ల రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టలను ఏర్పాటు చేయడానికి రూ. 5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. చందనవెల్లిలో డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు అదానీకానెక్స్ డేటా సెంటర్ రూ. 5,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. అంబుజా సిమెంట్స్ లిమిటెడ్ తెలంగాణలో ఏడాదికి 6 మిలియన్ టన్నుల సామర్థ్యంతో (ఎంటీపీఏ) సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌లో రూ.1,400 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అలాగే తెలంగాణలోని హైదరాబాద్‌లోని అదానీ ఏరోస్పేస్, డిఫెన్స్ పార్క్‌లోని కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, క్షిపణి అభివృద్ధి, తయారీ కేంద్రాలలో అదానీ గ్రూప్ ఏరోస్పేస్, డిఫెన్స్ రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు అవసరమైన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, సహాయాన్ని అందజేస్తుందని గౌతమ్ అదానీకి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వెంట ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఉన్నారు. అదానీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ప్రెసిడెంట్, సీఈవో ఆశిష్ రాజ్‌వంశీ, తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐటీఈ అండ్ సీ, ఐ అండ్ సీ, జయేశ్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రటరీ విష్ణు వర్ధన్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'గోడి ఇండియా' రూ. 8,000 కోట్ల పెట్టుబడులు గోడి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తెలంగాణలో రూ.8, 000 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చింది. అలాగే జేఎస్ డబ్ల్యూ ఎనర్జీ రూ.9, 000 కోట్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకరించింది. ఈ మేరకు గిగా స్కేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. మిగతా 2లో

### జేఎస్ డబ్ల్యూ ఎనర్జీ పెట్టుబడి రూ.9 వేల కోట్లు

మరోవైపు జేఎస్ డబ్ల్యూ ఎనర్జీ తెలంగాణలో రూ.9వేల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన చైర్మన్ సజ్జన్ జిందాల్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనితో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది.

## ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ

- యూపీఎస్సీ తరహాలో గ్రూప్స్‌పరీక్షల నిర్వహణ
- ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల నిజం చేస్తాం
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- నల్గొండ పట్టణంలో మున్సిపల్ రోడ్లకు శంకుస్థాపన



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో మున్సిపల్ రోడ్ల నిర్మాణానికి బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ మిగతా 2లో



## యువత అన్ని రంగాల్లో ముందు ఉండాలి

- ఎస్ ఆర్ ఆర్ ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి
- సంక్రాంతి సందర్భంగా కొండాపురంలో ఘనంగా ఆటల పోటీలు
- 'ఎస్ఆర్ఆర్', 'సోల్జర్స్ ఆఫ్ కలాం ఫౌండేషన్' సంయుక్తాధ్వర్యంలో నిర్వహణ

2లో

**కేసీఆర్ వల్లే రాష్ట్రంలో పేదరికం తగ్గింది** 3లో

**ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదు** 3లో

## రాష్ట్రానికే మణిహారంగా మంగళగిరి

- అందరం కలిసి నడిస్తే అభివృద్ధి సాధ్యం
- టీడీపీ యువనేత నారా లోకేశ్
- మంగళగిరి ప్రముఖులతో వరుస భేటీలు



**విశాల భారతి, ఆంధ్రప్రదేశ్:**

మంగళగిరిని యావత్ ఆంధ్రప్రదేశ్ కే మణిహారంగా తీర్చిదిద్దే బాధ్యత తనదని, ఈ మహోన్నత లక్ష్యాన్ని చేరుకునేందుకు అందరూ తనకు సహకరించాలని యువనేత నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో తటస్థ ప్రముఖులతో యువనేత లోకేష్ వరుస భేటీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మంగళగిరి, పరిసరాల్లో ఐదుగురు ప్రముఖులను లోకేష్ వారి ఇళ్లవద్దకు వెళ్లి కలుసుకున్నారు. తొలుత మంగళగిరి రూరల్ యర్రబాలెం వెళ్లి గరిక నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎరుకల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా నాగేశ్వరరావు యువనేత దృష్టికి తెచ్చారు. టిడిపి జనసేన ఆధ్వర్యంలో రాబోయే ప్రజాప్రభుత్వం అన్నివర్గాల అండగా ఉంటుందని లోకేష్ భరోసా ఇచ్చారు. తర్వాత బుడగజంగాల సామాజిక వర్గ ప్రముఖుడు ఊర వెంకటేశ్వరరావును కలుసుకొని వారు మిగతా 3లో

## గవర్నర్ తమిళిసై ఎక్స్ అకౌంట్ హ్యాక్

- సైబర్ క్రైమ్ సెల్ పోలీసులకు కంప్లైంట్
- ఇటీవల మంత్రి రాజ నర్సింహ అకౌంట్ కూడా హ్యాక్
- పొలిటికల్‌లీడర్లే టార్గెట్‌గా సైబర్ దాడులు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

గత కొంతకాలంగా ఎందరో సెలబ్రిటీలు, రాజకీయ నేతలు హ్యాకింగ్ బారిన పడుతున్న విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా హ్యాకింగ్ బాధితురాలయ్యారు. ఆమె ఎక్స్ (ట్విటర్) అకౌంట్ హ్యాక్‌కు గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు గవర్నర్ ఎక్స్ ఖాతాను హ్యాక్ చేసి పాస్ వర్డ్ మార్చినట్లు సమాచారం. కంపెనీ నియమనిబంధనలు ఉల్లంఘించారంటూ ఎక్స్ కంపెనీ నుంచి గవర్నర్‌కు ఓ మెయిల్ వచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ తన అకౌంట్‌ను ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా, పాస్ వర్డ్ తప్పంటూ జవాబు వచ్చినట్లు రాజ్ భవన్ అధికారులు తెలిపారు. అందులో పోస్టులను పరిశీలించిన తమిళిసై, తనకు సంబంధంలేని పోస్టులు పెట్టినట్లు గుర్తించారని వెల్లడించారు. ఈ విషయంపై రాజ్ భవన్ సిబ్బందిని ఆరా తీసినట్లు చెప్పారు. చివరకు తన అకౌంట్ హ్యాకింగ్‌కు గురైనట్లు గమనించిన గవర్నర్ తమిళిసై దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గవర్నర్ ఆదేశాలతో రాజ్ భవన్ అధికారులు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. గవర్నర్ ఎక్స్ అకౌంట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హ్యాక్ చేశారంటూ ఫిర్యాదు చేశారు.



### ఎమ్మెల్సీ కవిత సోషల్‌మీడియా అకౌంట్స్‌హ్యాక్

ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా అకౌంట్స్ హ్యాక్ అయ్యాయి. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్(ట్విట్టర్) హ్యాక్‌కు గురయ్యారయని కవిత తెలిపారు. సైబర్ నేరగాళ్లు మంగళవారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు పలుసార్లు హ్యాకింగ్‌కు యత్నించారన్నారు. అనుమానాస్పదంగా లాగిన్ అయ్యి దుండగులు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి సంబంధంలేని వీడియోను పోస్ట్ చేశారని తెలిపారు. వెంటనే గుర్తించి సోషల్ మీడియా ఖాతాలు హ్యాకింగ్‌కు గురైనట్లు ఎక్స్(ట్విట్టర్) ద్వారా తెలిపారు. డీజీపీకి, సైబర్ సెక్యూరిటీ విభాగానికి ట్యాగ్ చేశారు. సోషల్ మీడియా ఖాతాలను పూర్తి స్థాయిలో తిరిగి పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.



## నెలాఖరులోగా రైతు బంధు జమ

- ఎన్ని ఇబ్బందులొచ్చినా రైతు డిక్లరేషన్ అమలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రేపటి నుంచే రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి పైసలు
- నిజామాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు నిధులు విడుదల చేసేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఈ మేరకు కీలక వివరాలను సేకరించడంతోపాటు.. ఒకేసారి నిధుల విడుదల కోసం కసరత్తు షురూ చేసింది. ఈ క్రమంలో రేవంత్ సర్కార్.. రైతు బంధు నగదు విడుదలపై కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ నెలాఖరులోగా రాష్ట్ర రైతుల ఖాతాల్లోకి రైతుబంధు నగదు జమవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన తుమ్మల నాగేశ్వరరావు.. మిగతా 3లో

# బిగ్ డీల్స్!

మొదటిపేజీ తరువాయి

ఈ యూనిట్ లో 12.5 జీడబ్ల్యూహెచ్ (గిగావాట్ ఫర్ అవర్ ) సామర్థ్యముండే బ్యాటరీ సెల్ తయారు చేయనున్నట్లు గోడి ఇండియా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో మహేశ్‌గోడి ప్రకటించారు. దానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. రాబోయే అయిదేండ్ల కాలంలో తెలంగాణలో లిథియం, సోడియం అయాన్, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాల పరిశోధన, అభివృద్ధి , గిగా స్కేల్ సెల్ తయారీ కేంద్రం నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా 6వేల మందికి తొలి దశలో ఉద్యోగాలు కలిపిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.



### తెలంగాణలో గ్రీన్ ఫీల్డ్ డేటా సెంటర్

మరోవైపు రూ. 5,200 కోట్లతో వెబ్ వర్క్ టేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. తెలంగాణలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణలో ఔషధాల ఆవిష్కరణ, అభివృద్ధి సేవలను విస్తరించేందుకు ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ మరిన్ని పెట్టుబడులకు సిద్ధమవుతోంది. ఈ మేరకు రూ.2,000 కోట్ల కొత్త పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 1,500 కొత్త ఉద్యోగాలను అందించేలా తమ ప్రాజెక్టులను విస్తరించనుంది. తెలంగాణలోని మల్లాపూర్‌లో ప్రస్తుతం ఉన్న సదుపాయాన్ని మరింత పెంచుకోవడానికి కొత్త పెట్టుబడులు పెడుతోంది. తెలంగాణలో ఔషధాల ఆవిష్కరణ, అభివృద్ధి సేవలను విస్తరించేందుకు ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ మరిన్ని పెట్టుబడులకు సిద్ధమవుతోంది. ఈ మేరకు రూ.2,000 కోట్ల కొత్త పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 1,500 కొత్త ఉద్యోగాలను అందించేలా తమ ప్రాజెక్టులను విస్తరించనుంది. తెలంగాణలోని మల్లాపూర్‌లో ప్రస్తుతం ఉన్న సదుపాయాన్ని మరింత పెంచుకోవడానికి కొత్త పెట్టుబడులు పెడుతోంది. దీంతో ఆసియాలోనే ఔషధ పరిశ్రమకు హబ్ గా పేరొందిన హైదరాబాద్ స్థానం మరింత సుస్థిరమవనుంది. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో భాగంగా ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈవో మణి కంటిపూడి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో భేటీ అయ్యారు. ఫార్మా రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ప్రణాళికలను ఎంచుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ కొత్త ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయని అన్నారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలు సిద్ధించటంతో పాటు భవిష్యత్తుకు అవసరమైన శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతుందని అన్నారు. కొత్త ఆవిష్కరణలతో ఇక్కడున్న ప్రతిభా నైపుణ్యాలకు మరింత గుర్తింపు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాబోయే అయిదేండ్లలో తమ సేవలను విస్తరించే ప్రణాళికను ప్రకటించటం సంతోషంగా ఉందని కంపెనీ సీఈవో మణి కంటిపూడి అన్నారు. హైదరాబాద్‌లో రూ. 2,000 కోట్ల పెట్టుబడులకు నిర్ణయం తీసుకున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త ఔషధ ఆవిష్కరణలు, పరిశోధన సంస్థల కేంద్రంగా హైదరాబాద్ జాతీయ స్థాయిలో తనకున్న హోదాను నిలబెట్టుకుంటుందనే విశ్వాసం కలుగుతోందన్నారు. తమ కంపెనీ విస్తరణకు తగినంత మద్దతు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ విస్తరణతో హైదరాబాద్ దేశంలోనే కాంట్రాక్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ హబ్ గా మారనుంది. కొత్త డ్రగ్స్, డివైజ్‌లను కనుగొనేందుకు, అభివృద్ధి చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా 1,000 మందికి పైగా ఆవిష్కర్తలకు హైదరాబాద్ సేవలందిస్తోంది. కొత్త ఔషదాల సృష్టి, అభివృద్ధి, తయారీ సేవల విభాగంలో ఆరాజెన్ కంపెనీకి 20 ఏళ్లకుపైగా అనుభవముంది. ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ రంగాలకు కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలను ఈ కంపెనీ అందిస్తోంది.

## ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ



మొదటిపేజీ తరువాయి

చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. యూపీఎస్సీ తరహాలో గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తామని, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తామన్నారు. నల్లగొండ మున్సిపాలిటీనీ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసి నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల కోసం ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందిస్తామని ఆయన వెల్లడించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారంపై అంశంపై కేబినెట్ లో నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి శివాజీనగర్ సెంటర్ నుంచి పానగల్ రోడ్డు వరకు రూ. 90 లక్షల రూపాయల ఎన్‌సీఏపీ ఫండ్స్‌తో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు, ఎన్‌జీ కళాశాల నుంచి రామగిరి వరకు కోటి 30 లక్షల రూపాయల నిధులతో విస్తరిస్తున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పట్టణంలో కొత్తగా నిర్మించిన కూరగాయల మార్కెట్ సెంటర్ ని పరిశీలించిన మంత్రి చేపట్టాల్సిన మార్పుల గురించి కలెక్టర్ కి పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్డీవో ఆఫీస్‌లో 244 మంది లబ్దిదారులకి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసి మాట్లాడారు. నల్గొండ ప్రజలు ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి నాపై పెద్ద బాధ్యత పెట్టారన్నారు మంత్రి. రాబోయే రోజుల్లో నల్గొండ నలువైపులా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని హామీ ఇచ్చారు. పాత ప్రభుత్వంలో ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినట్టు .. కాంగ్రెస్ ప్రభుత్వంలో తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా లబ్ధిదారులకి సంక్షేమ ఫలాలను అందిస్తామని తెలిపారు.



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ చేయలేను

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ భర్తీ చేయాలని భావిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ భర్తీపై తాజాగా గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ షాక్ ఇచ్చారు. దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గత జూలైలో బీఆర్ఎస్ మంత్రిమండలి తీర్మానం చేసింది. ఈ నిర్ణయాన్ని గవర్నర్ తమిళిసై గతేడాది సెప్టెంబర్ 19న తిరస్కరించారు. గవర్నర్ తన పరిధి దాటి వ్యవహరించారని, మంత్రిమండలికి ఎమ్మెల్సీలను నామినేట్ చేసే హక్కు ఉంటుందని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై పది రోజుల కిందట విచారణ జరిగింది. దీంతో తాజాగా ఎమ్మెల్సీల ప్రతిపాదనను గవర్నర్ పక్కకు పెట్టారు. వాటిపై ఇప్పటికే కోర్టులో కేసు ఉందని ఆ కేసు పరిష్కారం అయిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. రాజ్ భవన్ ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ చేయాలని అనుకుంటున్న కాంగ్రెస్‌కు గట్టి షాక్ తగిలినట్లయింది.

## గవర్నర్ తమిళిసై ఎక్స్ అకౌంట్ హ్యాక్

మొదటిపేజీ తరువాయి

దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. ఇటీవలే రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఫేస్‌బుక్ ఖాతా కూడా హ్యాక్‌కు గురైన విషయం విధితమే. మంత్రి ఖాతాను తమ కంట్రోల్‌లోకి తీసుకున్న సైబర్ కేటుగాళ్లు, అందులో బీజేపీ, టీడీపీ, తమిళనాడుకు చెందిన పలు రాజకీయ పార్టీల ఫొటోలను వందల సంఖ్యలో పోస్టు చేశారు. అనుచరులు అలర్ట్ చేయడంతో స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ తన ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్‌కు గురైందని, అందులో పెట్టిన పోస్టులకు ఎవరూ స్పందించవద్దని కార్యకర్తలు, నేతలకు సూచించారు. ఈ మేరకు హ్యాకింగ్ ఘటనపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గతంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ అకౌంట్లు కూడా హ్యాకింగ్‌కు గురయ్యాయి.

# యువత అన్ని రంగాల్లో ముందు ఉండాలి







రాయపర్తి, విశాల భారతి:

యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్ ఆర్ ఆర్ ఫార్ట్యూన్ ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత పరుపాటు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎస్ఆర్ఆర్ ఫ్యార్ట్యూన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్, 'సోల్జర్స్ఆఫ్‌కలాం ఫౌండేషన్'సంయుక్తాధ్వర్యంలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో యువతులకు ముగ్గుల పోటీలు, యువకులకు వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, విశిష్ట అతిథిగా సోల్జర్స్ఆఫ్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదారపు అశోక్ , ప్రధాన కార్యదర్శి రాధారపు రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ యువత చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని పిలుపునిచ్చారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు ఎల్లవేళలా ముందుంటానని శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. సామాజిక స్వచ్ఛంద సేవ తనకు ఎంతో తృప్తి నిస్తుందన్నారు. ఎదిగే యువతను సరైన మార్గంలో నడిపితే వారు అద్భుతాలు సృష్టిస్తారని, మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని చెప్పారు. వందలాది స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టినా, గవర్నర్‌నుంచి అవార్డు పొందినా.. తనకు రోజు రోజుకు ప్రజాసేవపై మక్కువ పెరుగుతుందే తప్పా.. తగ్గదన్నారు.

### బహుమతుల పంపిణీ

అనంతరం ముగ్గుల పోటీల్లో, వాలీబాల్ , క్రికెట్ లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి ఆర్ లావణ్య, ద్వితీయ బహుమతి తేరాల నిత్యాష, తృతీయ బహుమతి అన్నపురపు తేజస్విని సాధించగా, క్రికెట్ లో ఫస్ట్ ప్రైజ్‌కన్నెబోయిన రాజు అండ్ టీం, సెకండ్‌ప్రైజ్ ఎండీ ఖాదర్ పాషా అండ్ టీం, వాలీబాల్ ప్రథమ బహుమతి కుల రాకేశ్‌అండ్ టీం, ద్వితీయ బహుమతి రామగిరి శ్యామ్ అండ్ టీం గెలుపొందారు. వారికి నిర్వాహకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాదారాపు అశోక్, రాధారపు రాజు తదితరులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోదాడ దయాకర్ రావు, మాజీ సర్పంచ్ ఎనగందుల మురళి, టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి పెండ్యాల వంశీ ,యూత్ కాంగ్రెస్ నాయకులు ఖదీర్, సోనీ మరియు గ్రామస్తులు రాసాల రామ్మూర్తి, తీరాల రాజు, బండారి సురేందర్, దురుశెట్టి మురళి, అంగిరేకుల మధుకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్ రావు, బీఆర్ఎస్ కొండాపూర్ గ్రామ పార్టీ కార్యదర్శి నూనె సుమన్, కొండ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

### పుట్టి పెరిగిన ప్రాంతాన్ని ఎప్పటికీ మరువను : పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

తాను పుట్టి పెరిగిన ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు ఎల్లవేళలా ముందుంటానని శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. సామాజిక స్వచ్ఛంద సేవ తనకు ఎంతో తృప్తి నిస్తుందన్నారు. ఎదిగే యువతను సరైన మార్గంలో నడిపితే వారు అద్భుతాలు సృష్టిస్తారని, మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని చెప్పారు. వందలాది స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టినా, గవర్నర్ నుంచి అవార్డు పొందినా.. తనకు రోజు రోజుకు ప్రజాసేవపై మక్కువ పెరుగుతుందే తప్పా.. తగ్గదన్నారు.

### యువత, స్టూడెంట్లకు బాసటగా.. సోల్జర్స్ఆఫ్‌కలాం ఫౌండేషన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మాదారపు అశోక్

నిరుద్యోగులు, యువతకు, అనాథలకు 'సోల్జర్స్ ఆఫ్ కలం ఫౌండేషన్' బాసటగా నిలుస్తున్నది. వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నది. యువతకు, స్టూడెంట్లకు అవసరమైన సమయంలో సకల సౌకర్యాలు కల్పిస్తూ.. స్టూడెంట్లకు అవసరమైన స్టడీమెటీరియల్, సాయమందిస్తూ వారికి ఆర్థిక భారం నుంచి విముక్తి కల్పిస్తున్నది. ఎదిగే యువతకు దేశ ఔన్నత్యాన్ని తెలియ పరచడానికి, వారిలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు మండల పరిధిలో దైవ కార్యక్రమాలను నిర్వహిస్తూ.. సమాజ చైతన్యంలో ఎల్లవేళలా ముందుంటుంది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదారపు అశోక్ మండలంలోని యువతకు ప్రతినిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ, ఎదిగే యువకుల్లో ఎవరెవరికీ ఏయే రంగాల్లో సామర్థ్యం ఉందో గుర్తిస్తూ.. సానపడుతూ.. తనదైన దారిలో సాయమందిస్తూ మండల ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఫౌండేషన్‌జనరల్ సెక్రటరీ రాధారపు రాజు, మెంబర్లను ఎప్పటికప్పుడు అన్ని కార్యక్రమాల్లో అలర్ట్‌చేస్తూ.. సమాజ సేవలో ముందుంటూ నడిపిస్తున్నారు.













# కోలుకుంటున్న బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్

ఊత కర్ర సాయంతో నడుస్తున్న వీడియో వైరల్.. • 'ఎక్స్' లో వీడియో పోస్ట్ చేసిన ఎంపీ సంతోష్‌కుమార్ • పార్లమెంట్ ఎన్నికల సంగ్రామం నాటికి మాజీ సీఎం రెడీ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కోటు కుంటున్నారు. హిప్ రిప్లేస్‌మెంట్ (తుంటి ఎముక మార్పిడి) శస్త్రచికిత్స అనంతరం డిశ్చార్జ్ అయిన విషయం తెలిసిందే. సర్జరీ తర్వాత ముందుగా హైదరాబాద్ నందినగర్ లోని ఆయన ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ కు చేరుకున్నారు. ఫామ్ హౌస్ లో వైద్యుల పర్యవేక్షణలో కేసిఆర్ చికిత్స తీసుకుంటున్నారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, సహాయకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం కేసీఆర్ ఊత కర్ర సాయంతో నడుస్తున్నారు. అయితే, సర్జరీ నాటి నుంచి ఆయన ఆరోగ్య పరిస్థితిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఫామ్ హౌస్ లో కెసిఆర్ నడుస్తున్న వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో ఎంపీ సంతోష్ కుమార్ పోస్ట్ చేశారు. మరింత దృఢ సంకల్పంతో కేసీఆర్ త్వరలోనే ప్రజల ముందుకు వస్తారని ఎంపీ సంతోష్ కుమార్ పోస్ట్ చేసిన చేశారు. కాగా.. కేసీఆర్‌కు శాస్త్ర చికిత్స నాటి నుంచి మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు.. పార్టీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా.. సమీక్షా సమావేశాలు నిర్వహించి.. నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అయితే, పార్లమెంట్ ఎన్నికల నాటికి.. కేసీఆర్ పూర్తిగా కోలుకుని.. ప్రజా క్షేత్రంలోకి రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడినుంచే పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.





## రాష్ట్రానికే మణిహారంగా
# మంగళగిరి

**మొదటిపేజీ తరువాయి**

ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. తమ సామాజికవర్గయులు అధికశాతం చిలకజోస్యం, వీధులవెంట బొమ్మల విక్రయం వంటి వృత్తులపై ఆధారపడుతూ గడుపుతుంటారని తెలిపారు. సంచారజాతిగా ఉన్న తమవారికి సంక్షేమ పథకాలు అందడం లేదని చెప్పారు. అనంతరం మంగళగిరి 17వ వార్డుకు చెందిన సగర సామాజికవర్గ ప్రముఖుడు ఖగ్గా వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లారు. వారి కుటుంబసభ్యులు యువనేతకు ఆప్యాయంగా స్వాగతం పలికారు. నిర్మాణరంగంలో మెటీరియల్ సప్లయర్ గా ఉన్న వెంకటేశ్వరరావు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లోకేష్ దృష్టికి తెచ్చారు. యువనేత స్పందిస్తూ గత నాలుగున్నరేళ్లలో ఇసుక అందుబాటులో లేక 40లక్షలమంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డునపడ్డారని తెలిపారు. రాబోయే రోజుల్లో సరళమైన ఇసుకపాలసీ తెచ్చి భవననిర్మాణ రంగానికి గతవైభవం తెస్తానని చెప్పారు. అనంతరం మంగళగిరి టౌన్ 9వ వార్డు వెల్లి సాయి ప్రవీణ్ జ్యూవెలర్స్ అధినేత తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్లును కలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కండేయ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు లక్ష్మీ పెరుమాళ్లు అందిస్తున్న సేవలను యువనేత కొనియాడారు. వెంటనే పేదలకు మరింత విస్తృతమైన సేవలందించేందుకు తమవంతు సహాయ,సహకారాలు అందిస్తానని చెప్పారు. చివరగా ఆత్మకూరుకు చెందిన దేవాంగ ప్రముఖుడు భల్లా వెంకటరమణ కుటుంబాన్ని కలుసుకున్నారు. అమరావతి దేవాంగ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న వెంకటరమణ పలు చారిటీ కార్యక్రమాలతోపాటు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ సేవలందిస్తున్నారు. యువగళం సందర్భంగా తాను రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసిన సమయంలో చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేశానని చెప్పారు. మరో 3నెలల్లో చంద్రబాబు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని లోకేష్ పేర్కొన్నారు.





# మేడారం.. జనసంద్రం



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు కొలువైన మేడారం బుధవారం జనసంద్రంగా మారింది. అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లులకు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగ చూడు తల్లీ అంటూ వేడుకుని యాటపోతులను సమర్పించి జాతర పరిసరాల్లో విడిది చేశారు. భక్తులు విడిది చేయడంతో జాతర పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు పోటెత్తడంతో అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో అనుమతించారు. కాగా బుధవారం ఒక్కరోజే జాతరకు 50 వేల మంది భక్తులు వచ్చినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.

## సురేశ్ గోపీ కుమార్తె పెళ్లికి హాజరైన మోడీ

**విశాల భారతి, నేషనల్‌బ్యూరో:**

మలయాళ నటుడు, బీజేపీ నేత సురేశ్ గోపి కుమార్తె వివాహానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. కేరళ పర్యటనలో ఉన్న ఆయన.. కొచ్చిలో రోడ్ షో చేపట్టిన అనంతరం త్రిస్సూర్ వచ్చారు. గురువాయూర్ ఆలయంలో కొత్త జంటను ఆశీర్వదించి వారిద్దరికీ వరమాలలు అందించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు మీడియాలో దర్శనమిచ్చాయి. సురేశ్ గోపి కుటుంబం, కొత్త జంటతో మాట్లాడిన మోదీ.. వారితో ఫొటోలు తీసుకున్నారు. ఈ వేడుకలో మోహన్‌లాల్, మమ్ముట్టి, తదితర మలయాళ నటులు సందడి చేశారు. వారితోనూ ప్రధాని ముచ్చటించారు. అలాగే మరో 30 జంటలను ఆశీర్వదించారు. వధువు భాగ్య సురేశ్.. సురేశ్ గోపి పెద్ద కుమార్తె. ఇదిలా ఉండగా.. బుధవారం ఉదయం ప్రధాని గురువాయూర్‌లోని కృష్ణుడి ఆలయంలో పూజలు చేశారు. దానికి సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో షేర్ చేశారు. వాటిలో ఆయన సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. ప్రతి భారతీయుడి సుఖ సంతోషాల కోసం పూజలు చేసినట్లు వెల్లడించారు. ప్రధాని రాకతో ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత కనిపించింది. హెలిప్యాడ్ వద్దకు భారీసంఖ్యలో మద్దతుదారులు రావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా కనిపించింది. కొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో.. మోదీ దక్షిణాది రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించారు. నిన్న కొచ్చిలో రోడ్‌షో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.





## నెలాఖరులోగా
# రైతు బంధు జమ

**మొదటిపేజీ తరువాయి**

రైతు బంధు నిధుల విడుదలపై మాట్లాడారు. నందమూరి తారక రామారావు స్ఫూర్తితో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఆంధ్రానగర్ లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసిన మంత్రి తుమ్మల.. నిజామాబాద్ జిల్లా వ్యవసాయానికి పెట్టింది పేరంటూ పేర్కొన్నారు. ఎన్టీఆర్ నేటికీ తన ఆదర్శ నాయకుడంటూ మంత్రి పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారంటూ పేర్కొన్నారు. ఈ సందర్భంగా.. రైతుబంధుతోపాటు.. రుణమాఫీపై కూడా తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. రెండు లక్షల రైతుల రుణమాఫీని దశలవారీగా రైతు ఖాతాల్లోకి జమ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే, రైతు డిక్లరేషన్ ను అమలు చేసి తీరుతామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇప్పటికే రెండెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిన 29 లక్షల మంది రైతులకు రైతు బంధు అందించామని, మిగతా రైతులకు కూడా రేపటి నుంచి వారి ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ నెలాఖరు లోపు రైతులందరి ఖాతాల్లో రైతు బంధు నిధులు పడతాయన్నారు.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తామని అన్నారు. రైతాంగ అవసరాలు, కష్టాలు తెలిసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడబోమని, ఎన్నికల సమయంలో రైతాంగ డిక్లరేషన్ లో పొందుపర్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి భరోసా కల్పించారు. ఇప్పటికే రెండెకరాలలోపు వ్యవసాయ భూమి కలిగిన 29 లక్షల మంది రైతులకు రైతు బంధు అందించామని, మిగతా రైతులకు కూడా రేపటి నుంచి వారి ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ నెలాఖరు లోపు రైతులందరి ఖాతాల్లో రైతు బంధు నిధులు పడతాయని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీని అమలు చేసే విషయంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో పట్టుదలతో కృషి చేస్తున్నారని అన్నారు. యాసంగి సీజన్‌లో రైతుబంధు వేయడానికి రూ.7,625 కోట్ల నిధులు అవసరం కాగా.. ఇప్పటివరకు ఎకరం లోపు పొలం ఉన్న 21 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రూ.1,050 కోట్లు జమ చేసింది. మిగతా రైతులకు మనీ రావాల్సి ఉంది. మిగతా నిధుల కోసం కేంద్రాన్ని రూ.13,500 కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతి కోరగా.. కేంద్రం రూ.9 వేల కోట్ల రుణం తీసుకోవడానికి అనుమతి ఇచ్చింది. వాటిలో 2 వేల కోట్లు ఈనెల వచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఈ రుణం నుంచి కొంత రైతుబంధు పథకం కింద రైతులకు జమ చేసే అవకాశాలు ఉన్నాయి.

## ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన
# బీఆర్ఎస్‌కు లేదు

- హామీలను నెరవేర్చకుంటే ప్రజలే కూల్చుతారు
- వంద రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్ పార్టీకి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేయకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని కూల్చుతారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వం కూలబోతుంది అని హెచ్చరిక చేయడం, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి పని చేద్దాం అని మాట్లాడడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రంలో బుధవారం ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య ఇంట్లో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదని స్పష్టం చేశారు. 39 మంది ఎమ్మెల్యేలు, శాసనమండలిలో మెజారిటీ సభ్యులతో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని చెప్పారు. అనవసరంగా బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలు సరికాదని..బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లు ప్రజల ఆశీర్వాదంతో ఎన్నో గొప్ప పనులు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పోరాటం తప్పకుండా చేస్తోందన్నారు.

## పవన్ కళ్యాణ్‌ను కలిసిన వైఎస్ షర్మిల



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కలిశారు. హైదరాబాద్‌లోని పవన్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహానికి హాజరుకావాలని ఆహ్వానిస్తూ పవన్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరుల వివరాలను పవన్ అడిగి తెలుసుకున్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా నియమితురాలైన వైఎస్ షర్మిలకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా.. రేపు సాయంత్రం హైదరాబాద్‌లో వైఎస్ రాజారెడ్డి ఎంగేజ్‌మెంట్ జరగనుంది. ఈ కార్యక్రమానికి రాజారెడ్డి మేనమామ, సీఎం జగన్ హాజరుకానున్నారు. షర్మిల కుమారుడు రాజారెడ్డి ఎంగేజ్మెంట్ వేడుకలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు.

# కేసీఆర్ వల్లే రాష్ట్రంలో పేదరికం తగ్గింది

- ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు
- రాష్ట్ర ప్రగతిని నీతి ఆయోగ్ రిపోర్ట్స్ చెప్పాయని వెల్లడి
- దావోస్‌లో ఏ అభివృద్ధి వివరిస్తున్నారో సీఎం చెప్పాలని ఎద్దేవా..

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

రాష్ట్రంలో గత పదేండ్లలో మాజీ సీఎం కేసీఆర్‌చేపట్టిన పలు కార్యక్రమాల వల్లనే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు బుధవారం అన్నారు. బహుమితీయ పేదరిక సూచీ 13.18 శాతం నుంచి 3.76 శాతానికి బాగా క్షీణించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం పేరుతో సాగుతున్న దుష్ప్రచారాలకు తగిన సమాధానం. తదుపరి పార్లమెంట్ ఎన్నికల కోసం నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం యొక్క సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, నీతి ఆయోగ్ తన నివేదికలలో రాష్ట్ర అభివృద్ధి కథనాన్ని ప్రశంసిస్తూ ఉందని ఎత్తి చూపారు. మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్రంలో శ్రేయస్సు, అభివృద్ధి యొక్క స్వచ్ఛతలో భాగంగా, అనేక పేదరిక నిర్మూలన పథకాలతో ప్రజలకు చేరువయ్యారని మరియు వారు పేదరికాన్ని తొమ్మిది శాతం నుండి 3.76 శాతానికి తగ్గించడంలో గొప్ప డివిడెండ్‌లను అందించారని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సొంత గుజరాత్‌లో విజయం సాధించింది. ఈ లెక్కన తెలంగాణ కంటే తమిళనాడు, కేరళ రాష్ట్రాలు మాత్రమే ముందున్నాయి. దావోస్‌లోని పెట్టుబడిదారులకు రాష్ట్రం గురించి అధ్వాన్నమైన చిత్రాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించిన ముఖ్యమంత్రి బృందం ఏమి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం వివిధ చోట్ల కాంగ్రెస్ ప్రాయోజిత హింసాత్మక ఘటనలను ప్రస్తావిస్తూ, రాజకీయ హింస, హత్యలకు దోహదపడే ఎలాంటి రెచ్చగొట్టినా రాష్ట్రానికి ప్రతిఘటన తప్పదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కనీసం 100 రోజులు పూర్తయ్యే వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఓపికతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడి 45 రోజులు పూర్తి చేసుకున్నప్పటికీ, బీఆర్ఎస్ కార్యకర్తలు తిరిగి కార్యాచరణలోకి దిగారు. పదకొండు నియోజకవర్గాల్లో పార్లమెంటరీ ఎన్నికలకు పార్టీ సన్నాహక సమావేశాలను పూర్తి చేసింది. నియోజకవర్గాల నుంచి ఇప్పటి వరకు పెద్దఎత్తున సూచనలు అందాయి. పార్టీ విధానాల రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో కార్యకర్తల అభిప్రాయానికి తగిన ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. "తెలంగాణ అభివృద్ధికి మనమంతా ఎంతో కృషి చేసినా, అసెంబ్లీ ఎన్నికల్లో వీడ్కోలుకోలేకపోయాం. కానీ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. రాష్ట్రావతరణ తరుణంలో వీరులుగా ప్రజల ఆకాంక్షల సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను మార్చడానికి బలమైన కారణం అవసరం లేదు. సామాజిక మాధ్యమాల మద్దతుతో కూడిన ప్రచార యుగంలో,



ప్రజలు మార్పు గురించి ఆలోచించడానికి సరైన కారణం కూడా అవసరం లేదు. ఏ రాష్ట్రంలోనూ పదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొనసాగడం చాలా అరుదు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలు మరియు వాగ్దానాలన్నింటినీ నెరవేర్చడానికి రూ. 3.5 లక్షల కోట్లకు పైగా అవసరం. కానీ తన హామీని నెరవేర్చడానికి ఖజానాపై భారం రాష్ట్ర బడ్జెట్ రూ. 2.9 లక్షల కోట్ల కంటే ఎక్కువగా ఉంటుంది, "అని ఆయన అన్నారు.



# పాలేరులో పర్యటించిన మంత్రి

**పాలేరు, విశాలభారతి:** పాలేరు నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు ముందుగా కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి తిరుమలాయపాలెం మండలంలో ఇటీవల చనిపోయిన బచ్చోడు పాతర్లపాడు జింకలగూడెం పలు కుటుంబాన్ని పరామర్శించారు ఈ కార్యక్రమంలో వారితో పాటు పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివరామకృష్ణ, రామ సహాయం నరేష్ రెడ్డి, మండల జెడ్పిటిసి బెల్లం శ్రీను, మండల ఎంపీపీ బోడా మంగీలాల్, కొప్పుల అశోక్, మద్దినేని స్వర్ణకుమారి, బండి జగదీష్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

**పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు**

**నూతనకల్ ,విశాలభారతి:** నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో బెల్ట్ షాపులను నియంత్రిస్తామని పలువురు మంత్రులు తెలియజేస్తూ బెల్ట్ షాపుల కట్టడికి కృషి చేస్తుంటే దానికి భిన్నంగా నూతనకల్ మండలాలలో చీకటి ఒప్పందంతో మద్యం సిండికేట్ వ్యాపారం కొనసాగుతుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మూడు వైన్స్ లో ఒకటి బెల్ట్ షాపుల కోసమే కేటాయించిన వైన్స్ నిర్వాకులు. కనీసం బోర్డుకూడా ఏర్పాటుచేయకుండా నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటని మందుబాబులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.నూతనకల్ మండల పరిధిలోని గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్వహణ విచ్చలవిడిగా కొనసాగిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. మద్యం అధిక ధరలను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతుంది. నూతనకల్, మద్దిరాల మండలాలలోని లైసెన్స్ మద్యం షాపులు సమయపాలన పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారికి ఇష్టం వచ్చిన సమయంలో




మద్యం దుకాణాలను ఓపెన్ చేసి బెల్ట్ షాపులకు అధిక రేట్లకు మద్యం సరఫరా చేస్తూ ఆ తర్వాత లైసెన్స్ మధ్య దుకాణాలను మూసివేసి వెళుతున్నారు. దీనితో ఎంఆర్పి ధరలకు అమ్మాల్సిన మద్యం మందుబాబులకు అందని ద్రాక్షల మారింది .అధిక రేట్లకు బెల్ట్ షాపుల్లో మద్యాన్ని కొనుగోలు చేసి మద్యం ప్రియులు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయించాల్సిన మద్యం వ్యాపారులు ఎక్సైజ్ అధికారులతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకొని ఎమ్మార్పీ ధరలకు కళ్లెం వేస్తున్నారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఎక్కువ శాతం మద్యాన్ని బెల్టు షాపులకు సరఫరా చేయడమే లక్ష్యంగా టెండర్ ద్వారా వచ్చిన మూడు వెన్స్ లో ఒక వెన్స్ షాప్ ని పూర్తిగా బెల్ట్ షాపుల కోసమే కేటాయించి అధిక లాభాలను అర్జిస్తున్నారు. లైసెన్స్ మద్యం దుకాణదారులు ఒక్క కోటర్ బాటిల్ కు 20 రూపాయలు అదనంగా తీసుకోగా బెల్ట్ షాప్ నిర్వాహకులు మరో 20 రూపాయలు అదనంగా వసూలు చేయడంతో మద్యం ప్రియులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.



# కాంగ్రెస్ తోనే పేదలకు మేలు

**ఎన్ఎస్ యూఐ జిల్లా నాయకులు సతీష్**

**మిర్యాలగూడ,విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేద వర్గాలకు మేలు జరుగుతుందని నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వాపల్లి గ్రామానికి చెందిన ఎన్ ఎస్ యూ ఐ జిల్లా నాయకులు సతీష్ అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కాంగ్రెస్ యువనేత బల్మూరి వెంకట్ ను హైదరాబాదులో కలిశారు. సందర్భంగా సతీష్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పాలనలో సరైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సపోర్ట్ తో అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామన్నారు. ఆయన వెంట స్థానిక నేతలు ఉన్నారు.



# విగ్రహాలను ఎత్తుకెళ్లిన దుండగులు

**దొంగలించిన వస్తువుల సోత్తు రెండు లక్షలు**

**మరిపెడ, విశాలభారతి:**మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో మంగళవారం రాత్రి ఒక అమానుషమైన ఘటన చోటుచేసుకుంది అది ఏంటంటే గుండెపుడి గ్రామ శివారులో ఉన్నటువంటి సీతారాములవారి దేవస్థానంలోకి కొంతమంది దుండగులు గుర్తుతెలియని వ్యక్తులు జొరబడి దేవుళ్లను గరుడ వాహనం, ఆంజనేయస్వామి విగ్రహం, శేష వాహనం (గుర్రం), వాహనం యొక్క గొడుగు బంగారు పూతతో చేసినటువంటి నాణ్యాలు రాత్రికి రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు యధావిధిగా ఉదయాన్నే ఊళ్లోకి వచ్చిన పూజారి గుడిలోని పక్కన ఉన్నటువంటి రూం తలుపులు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూస్తే తలుపు తాళం పగలగొట్టి లోపల ఉన్న వాటిని దొంగతనంగా తీసుకెళ్లినట్టు గుర్తించాడు వెంటనే పోలీసులకి మరియు గ్రామస్తులకు ఈ సమాచారాన్ని అందించాడు దేవాలయంలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు చర్యలు చేపట్టారు గుండెపుడి గ్రామంలో ఉన్న ఈ గుడి చాలా పురాతనమైనది చాలా ప్రత్యేకత మహిమ కలిగినది ఇప్పటికీ ఒక రెండు మూడు సార్లు గతంలో ఈ గుడిలో దొంగతనాలు జరిగాయి అయినా కూడా మళ్లీ పోయిన విగ్రహాలు తిరిగి దొరికాయి. కానీ ప్రతిసారి ఎందుకు ఇలా ఈ గుడిలోనే దొంగతనాలు జరుగుతున్నాయని, ఇలా విగ్రహాల అపహరణ జరగడం. పై గ్రామానికి సంబంధించిన కొంతమంది మీద అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి . ఆలయ సిబ్బందికి సంబంధించిన వారి సహకారం లేనిదే ఈ దొంగతనం జరగదు అని గ్రామంలోని కొంతమంది ప్రజలు అంటున్నారు. ప్రతిసారి ఇలా గుడిలోని విగ్రహాలు పోవడం పట్ల, ప్రజలంతా తీవ్ర ఆసహానానికి గురవుతున్నారు.



# కేసీఆర్ అందించిన గొప్ప పథకం కళ్యాణ లక్ష్మి

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ**

**పటాన్ చెరు(గుమ్మడిదల)విశాలభారతి:**రాష్ట్రంలోని ఆడపిల్లల పెళ్లి నిరుపేద కుటుంబాలకు భారం కావద్దన్న సమున్నత లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ద్వారా మంజూరైన ఏడు లక్షల రూపాయల విలువైన చెక్కులను సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ గంగా భవాని, తదితరులు పాల్గొన్నారు.

# నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఆన్ లైన్ యాప్ ల పట్ల అప్రమత్తత అవసరం**

**నల్లగొండ, విశాలభారతి:** సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యస్.పి జి.చందనా దీప్తి ఐపిఎస్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యస్.పి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు పెరుగుతున్న టెక్నాలజీని ఆసరా చేసుకుని అమాయక ప్రజలను అధిక వడ్డీ ఆశా చూపి పెట్టిన పెట్టుబడి కంటే అధిక డబ్బులు వస్తాయని మోసం చేస్తున్నారు. అనేక మంది అమాయకులని మోసం చేస్తున్న కేసులు ఈ మధ్య కాలంలో చాలా నమోదు అవుతున్నాయన్నారు. జిల్లా ప్రజలు ఇలాంటి అన్ లైన్ యాప్ లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు అని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, మెసేజ్ లు క్లిక్ చేయకూడని, నకిలీ వెబ్ సైట్ల ద్వారా అమాయకు లను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు లాగేస్తున్నారు. అంతే కాకుండా వైద్య సహాయం,పేరు పొందిన కంపెనీలలో ఉద్యోగాల పేరుతో సులభంగా నమ్మే మోసాలను ఎంచుకొని మోసాలు చేస్తున్నారని, లోన్ యాప్ అంటూ సులభంగా లోన్ లు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తూ మీ యొక్క డేటా మొత్తం తమ అధీనం లోకి తీసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కాబట్టి ఎవరు అలాంటి యాప్ లను డౌన్లోడ్ చేయకూడదని, ఎవరైనా ఇలాంటి మోసాలకు గురి అయితే



వెంటెనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించా లని లేని యెడల హెల్ప్ లైన్ నంబర్ 1930కానీ 155260 కి కాల్ చేసి తెలపాలన్నారు.

సైబర్ నేరగాళ్లు చెప్పే మాటలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మకూడదు. సెల్ ఫోన్లు కు వచ్చే కేవైసి అప్డేట్ మెసేజ్లు,బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని చెప్పే మాటలు నమ్మకూడదు.బహుమతులు వస్తాయంటు పంపే లింకులు క్లిక్ చేయకూడదు. సోషల్ మీడియా వేదికగా ఎవరికి బ్యాంకు యొక్క ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు ఓటిపిలు తెలపవద్దంటూ సూచించారు.

# సాంప్రదాయాలను కాపాడుకోవాలి

**విజేతలకు బహుమతుల పంపిణీ**

**మరిపెడ, విశాలభారతి:** సంస్కృతి సాంప్రదాయాల తోపాటు గ్రామీణ కళలను కాపాడుకోవాలని సామాజిక ఉద్యమకారులు, సీనియర్ పాత్రికేయులు జిన్న లచ్చయ్య అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా సోమవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సీనియర్, జూనియర్ విభాగంలో తన కళలతో నైపుణ్యతను ప్రదర్శించిన ముగ్గులు వేసిన వారిని గుర్తించి వారికి బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జడ్జిమెంట్ గా వ్యవహరించిన సీనియర్ పాత్రికేయులు జిన్న లచ్చయ్య మాట్లాడుతూ గ్రామంలో గత అనేక సంవత్సరాలుగా సాంప్రదాయపద్ధంగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రధాన ఉత్సవం చేశారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి జినక సౌజన్య, ద్వితీయ బహుమతి జినక సంధ్య, తృతీయ బహుమతి ఆడేపు మల్లేశ్వరి,కి అందజేశారు. అట్లాగే



జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి జినక శ్రీ వర్షిని, ద్వితీయ బహుమతి ఎన్ అశ్విని, తృతీయ బహుమతి బి అమ్ములు గెలుపొందారు. సీనియర్ కు 1000 రూపాయలు, జూనియర్ లో ఒక్కరికి 500 రూపాయలు కలపాక అనిల్ డొనేషన్ చేశారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ యువజన సంఘం యూత్ అధ్యక్షులు జినక నాగరాజ్, అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాల లీడర్లు తీగల లలిత, దూరు సుజాత, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఉపేందర్, ఉదయ్, ఉపేందర్, దిలీప్, మధు, స్టాలిన్, రాజు, చింటూ, చరణ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధాశ్రమంలో అన్నదానం

**మునగాల,విశాలభారతి:**మండల పరిధిలోని ఆకుపాముల గ్రామపంచాయతీకి చెంది. హైదరాబాదులోని తపచ్ఛిపుత్ర సిఐగా విదులు నిర్వహిస్తున్న సిఐ చెరువుపల్లి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ముకుందాపురం గ్రామంలో ఉన్న ఇందిరా వృద్ధ అనాథ ఆశ్రమంలో తన మిత్రుల ద్వారా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు సహకరించారు ఇట్టి కార్యక్రమానికి. ముఖ్య అతిథులుగా సామాజిక ఉద్యమకారులు డాక్టర్ వేమూరి సత్యనారాయణ, పోలంపల్లి వెంకటేశ్వర్లులు పాల్గొని తమ చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,సీఐ శ్రీనివాస్ తన పుట్టినరోజు సందర్భంగా ఇలా వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు అనాథలకు మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, తమ పుట్టినరోజు వేడుకలు ఇలా నిడారంబరంగా తను రాలేకపోయినా తన మిత్రుల ద్వారానా ఇలా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి మిగిలిన వారికి ఆదర్శంగా నిలవడం సంతోషదాయకమన్నారు. ఇలాగే ప్రతి ఒక్కరూ ఆలోచించి తమ గృహాలలో జరిగే వివిధ కార్యక్రమాల సందర్భంగా ఇలా ఆశ్రమంలో ఉన్న వారికి అండగా నిలిచి ఆశ్రమంలో ఉన్న వారికి అండగా నిలవాలన్నారు. అలాగే ఆశ్రమ నిర్వాహకులకు దాతృత్వం గల దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించి, వారిని ప్రోత్సహించాలని నేడు పిల్లల భవిష్యత్తుకు తల్లి దండ్రులు తమ ఆస్తిపాస్తులను అమ్మి వారికి ఉన్నత విద్యను అందించి మంచి ప్రయోజకులను చేసేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ప్రయోజకులు చేస్తే. చివరకు వారిని . వృద్ధాప్యంలో పట్టించుకోకుండా వదిలి వేస్తున్న తరుణంలో ఇలాంటి ఆశ్రమ నిర్వాహకులు వారి హక్కున చేర్చుకొని వారికి అండగా నిలిచి చివరి మజిలీ వరకు సాకటం సంతోషమన్నారు.



# ఆర్థిక సహాయం అందజేత

**నడిగూడెం, విశాలభారతి:** మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన మొలుగూరి వెంకన్న తిరుపమ్మ ల కుమారుడు మొలుగూరి ఆకాష్ హైదరాబాదులోని మియాపూర్ దగ్గర బైక్ యాక్సిడెంట్ లో మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులకు విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ గుండు వెంకట్ గౌడ్ 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం గ్రామంలోని మృతుని నివాసం వద్ద మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట ఫౌండేషన్ కోఆర్డినేటర్ నందిగామ రామారావు సభ్యులు గుండు సీతారాములు, రవి ప్రతాప్, మొలుగురి కోటయ్య, పోలంపల్లి నరసింహారావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు,బి జే పి మండల మహిళా అధ్యక్షురాలు బండారు శోభారాణి గ్రామస్తులు ఆదిమల్ల నరేష్, మొలుగురి నరసింహారావు,ఆదిమళ్ల డేవిడ్, వీర గోవిందు, ఆదిమల్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

# సభను జయప్రదం చేయండి

**ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి**

**కోదాడ, విశాల భారతి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు హుజూర్నగర్ మాజీ శాసనసభ్యులు దొడ్డ నరసయ్య 25వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు పిలుపునిచ్చారు. స్థానిక డిఎన్ భవన్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాడు నిజాం నవాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన వీరోచత పోరాటంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దొడ్డ నరసయ్య ముందుండి ఉద్యమాన్ని నడిపించిన వీరుడు అని అన్నారు. ఈ నెల 19న చిలుకూరు మండల కేంద్రంలో జరిగే వర్ధంతి సభలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూణంనేని సాంబశివరావు, తెలంగాణ నీటిపారుదల శాఖ మాత్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి, సిపిఐ జాతీయ



సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ వర్ధంతి సభలో యువకులు, అభిమానులు భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు.



# పిసిసి ప్రధాన కార్యదర్శికి సన్మానం

**చిట్యాల, విశాలభారతి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడు టిపిసిసి ప్రదాన కార్యదర్శి చిలుక మదుసూదన్ రెడ్డిని వెలిమినేడు పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘురామారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ గా ఎన్నికైనందుకు రఘుమారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

**నూతనకల్,విశాలభారతి:** సంక్రాంతి సందర్భంగా కబడ్డీ పోటీలలో పాల్గొని తిరిగి వస్తున్న సందర్భంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నూతనకల్ ఎస్సై సిహెచ్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి సుమారు 11 గంటల సమయంలో ముక్కుడు దేవులపల్లి గ్రామం లో కబడ్డి ఆడి తిరిగి పల్సర్ ద్విచక్ర వాహనంపై దంతాలపల్లి గ్రామానికి వెళుతున్న గణేష్ ,తన ముగ్గురు స్నేహతులు నూతనకల్ శివారున గల హెచ్పి పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి అదే సమయంలో నూతనకల్ వైపునుండి సూర్యాపేట వైపు వెళుతున్న కారు డ్రైవరు శ్రీను అనే వ్యక్తి ద్విచక్ర వాహనానికి టక్కరు ఇవ్వగా ద్విచక్ర వాహనం నడుపుతున్న గణేష్ అక్కడికి అక్కడే మృతి చెందగా




మిగిలిన శ్రీను, రోహిత్ ,సమ్మయ్యకు గాయాలు తగిలి ఆసుపత్రిలో చిత్సపొందుతూ ఉన్నారు. ఇట్టి విషయంలో మృతుని పెద్దమ్మ ముత్యాల ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు పరిచి దర్యాప్తు ప్రారంభిస్తున్నామని ఎస్సై సిహెచ్ నరేష్ తెలియజేశారు .



# బహుమతులు అందజేత

**నూతనకల్, విశాలభారతి :** సూర్యాపేట జిల్లా చిల్పకుంట్ల గ్రామం లో సంక్రాంతి సందర్భంగా గత రెండు రోజులుగా పిడిఎస్యు పివైఎల్ ఆధ్వర్యంలో కబడ్డీ,మహిళ కబడ్డీ, ముగ్గులు,రసాకసి పోటీలలో విజయం పొందిన వారికీ బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడలు స్నేహభావంతో నిర్వహించాలని పోటా, పోటీలతోసంబంధం లేకుండా స్నేహ భావంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రగతిశీల యువజన సంఘం( పి వై ఎల్),ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం( పిడిఎస్యు) ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం, అభినందించదగ్గ విషయమని అన్నారు. భగత్ సింగ్, చేగువేరా, విద్యార్థి, యువజన అమరవీరుల స్ఫూర్తితో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని అన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా పోటీలు స్నేహభావంతో కొనసాగాలని వారన్నారు. చిల్పకుంట్ల గ్రామంలో సిపిఐ ఎంఎల్ పార్టీ నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుంది. దీనికి ఆకర్షితులైన వివిధ పార్టీల నుండి. తొట్ల,మల్లయ్య,పులుసు సత్తయ్య,కుసు నాగరాజు,దాసరి,లింగయ్య,గుండెబోయిన గణేష్ తదితరులు పార్టీ లో చేరటం జరిగింది.వారికి పార్టీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్, పెద్దింటి రంగారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి గంట,నాగయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు పోలేబొయిన కిరణ్,డివిజన్ నాయకులు దేశోజు మధు,అరుణోదయ జిల్లా నాయకులు,ఎర్ర ఉమేష్,తడకమల్ల నగమల్లు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్గానిక్ హోటల్ ని ప్రారంభించిన మంత్రి

**చిట్యాల, విశాలభారతి:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ సమీపంలో నూకల వెంకటరెడ్డి, నక్కల మాధవరెడ్డి లు నూతనంగా ఏర్పాటు చేసిన "విలేజ్ ఆర్గానిక్ కిచెన్" హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విచ్చేసి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి లతో కలిసి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోకల దేవదాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటన్ వెంకటేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ, పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కలిసి శుభాకాంక్షలు అందజేశారు. తిరుమల హిల్స్ లోని రంగారెడ్డి నివాసానికి వెళ్లి, మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రైతుల అభ్యున్నతికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. సత్తయ్య వెంట ఆర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.



## డైరెక్టర్ త్రివిక్రమ్.. హీరో మహేష్ బాబు
## క్షమాపణలు చెప్పాలి

- మడత కుర్చీ పాటను తొలగించాలి
- PDSU ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ

**చేవెళ్ల, విశాల భారతి:** ప్రపంచ మేధావి, ఆర్థికవేత, దాస్ క్యాపిటల్ రచయిత, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని నినాదం ద్వారా సమ సమాజ స్థాపన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మార్క్స్, ప్రపంచవ్యాప్తంగా శ్రామిక వర్గాన్ని విముక్తి చేయాలని తన జీవితాన్ని ధార పోసిన కామ్రేడ్ లెనిన్ ల పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్స్ కు పెట్టడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని PDSU ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్, PDSU ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజేష్ లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోపిడీ, పీడన అణిచివేత లేని సమాజం కోసం తమ జీవితాంతం కృషి చేసిన మార్క్స్, లెనిన్ వంటి మహనీయుల పేర్లను విలన్స్ కు పెట్టడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాంతం పోరాడిన లెనిన్ రష్యాలో సోషలిస్టు సమాజాన్ని ఏర్పాటు చేశారు అని.. అలాంటి చరిత్ర గలిగిన మహనీయుల పేర్లను డైరెక్టర్ త్రివిక్రమ్ విలన్స్ కు పెట్టడం .. అసభ్యకర మడత కుర్చీ బూతు పాటను తక్షణమే తొలగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం PDSU జిల్లా కమిటీగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేష్ బాబు చేసిన ఈ ఘోరమైన తప్పిదానికి బేసరత్తుగా, బహిరంగంగా క్షమాపణలు చెప్పి వీటిని తొలగించాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో PDSU ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్.. తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ నాయకుడు జ్యోతిబసు

జిట్టా నగేష్

**చిట్యాల, విశాలభారతి:** అవినీతి మచ్చలేని మహా నాయకులు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అన్నారు.చిట్యాల మండలం తాళ్ళవెళ్ళంల గ్రామంలో బుధవారం నాడు కా.జ్యోతిబసు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ 24 సం.ల పాటు సుధీర్ఘ కాలం బెంగాల్ ముఖ్య మంత్రి గా పనిచేసిన సిపిఎం సీనియర్ నాయకులు జ్యోతిబసు ఈ తరం రాజకీయ నాయకులకు ఆదర్శ పాయుడని కొనియాడారు. అనంతరం జరిగిన సిపిఎం గ్రామ శాఖ సమావేశంలో తాళ్ళవెళ్ళంల నూతన కార్యదర్శి గా పామనుగుళ్ళ దశరథ ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పామనుగుళ్ళ అచ్చాలు, మండల నాయకులు ఐతరాజు నర్సింహా, గ్రామ శాఖ నాయకులు కట్ట వెంకటేశం, కొమ్మనపల్లి గోపాలు, దొడ్డి యాదయ్య,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్రాభివృద్ధికి సహకారం అందించాలి

**తొర్రూరు, విశాలభారతి:** గ్రామ సమగ్రాభివృద్ధికి సహకారం అందించాలని హరిపిరాల సర్పంచ్ రావుల మమతారెడ్డి తెలిపారు. తొర్రూరు మండలంలోని హరిపిరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకును, గ్రంథాలయంను ప్రజా ప్రతినిధులు, స్థానికులతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామంలో నీటి సమస్యను తీర్చేందుకు మిషన్ భగీరథ నీటి సరఫరా చేయనున్నామని తెలిపారు. గ్రామంలో మంచినీటి కొరత, సాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటానన్నారు. నీళ్లు ఉంటేనే పల్లెలు అభివృద్ధి చెందుతాయన్నారు.విద్యార్థులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలు ఇతర ప్రవేశ పరీక్షలు కు సన్నద్ధం అయ్యేందుకు గ్రంథాలయం దోహదపడుతుందన్నారు. గ్రామంలోని విద్యార్థులు యువత సౌకర్యార్థం గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, ఉప సర్పంచ్ చెంచర్ల రాజు, పంచాయతీ కార్యదర్శి దేవయ్య, రావుల సురేష్ రెడ్డి, తల్లారి అశోక్, స్థానికులు పాల్గొన్నారు.





## కదిలి వచ్చిన కాలనీ వాసులు

**మిర్యాలగూడ, విశాలభారతి:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం గణేష్ నగర్ కు చెందిన నామిరెడ్డి యాదగిరి రెడ్డి (74) ఇటీవల మృతి చెందారు. అయితే వీరి కుమారులు దహన సంస్కారాలు చేయలేని స్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న ప్రకాష్ నగర్ కాంగ్రెస్ పార్టీ 8వ వార్డు ఇంచార్జ ఆంగోత్ చక్రి నాయక్ స్థానిక వర్కాల అశ్వినమ్మ రెడ్డితో పాటు స్థానికులను కలిసి సమస్యను వివరించారు. కాగా బుధవారం అంతా కలిసి స్థానిక షాబ్ నగర్ వైకుంఠధామం వద్ద ఆ వృద్ధునికి దహన సంస్కారాలు నిర్వహించారు. పేద వ్యక్తి దహన సంస్కారాలకు కాలనీ వాసులు ముందుకు రావడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. ఆపదలో అందరూ భరోసా ఉండాలన్న స్పృహను సమాజానికి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆంగోతు భాస్కర్ నాయక్, రమావత్ మధు, జగన్ నాయక్, సృజన్ నాయక్, నంద్యాల లక్ష్మమ్మ తదితరులున్నారు.



## ఆయిల్ ఫామ్ సాగు రైతులకు మేలు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ

**తొర్రూరు, విశాలభారతి:** ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ అన్నారు. తొర్రూరు మండలంలోని కంటాయపాలెం లోని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య ఆయిల్ ఫామ్ తోటను, హరిపిరాల గ్రామ శివారులోని ఆయిల్‌ఫాం నర్సరీ ని ఉద్యాన శాఖ అధికారులు సందర్శించారు. పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అయిల్‌ఫామ్‌కు ఎక్కువ డిమాండ్ ఉన్నందున విదేశాల నుంచి ఈ వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నా మన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ విస్తరణకు ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఆయిల్‌పామ్ సాగులో చీడపీడలు, వర్షాలు, కోతులు, అడవి పందులు, గాలివానలతో ఎలాంటి నష్టం ఉండదన్నారు. అలాగే ఆయిల్ పామ్ తోటలో అంతర పంట లను సాగు చేసుకోవచ్చ న్నారు. రైతులు పండించిన వీటి గెలల విక్రయాల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. తొర్రూరు శివారు గోపాలగిరి గ్రామంలో సామాజిక పరిశ్రమ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఫ్యాక్టరీ వరకు పంట రవాణా ఖర్చులను పూర్తిగా టీఎస్ ఆయిల్‌ఫెడ్ భరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి రాకేష్, కృష్ణ, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## ఎంపిఎల్ విస్తరణ ఆపండి

ప్రజాభిప్రాయ సేకరణ ఆపాలంటూ వినతులు

**చిట్యాల, విశాలభారతి:** చిట్యాల మండలం ఎలిమినేడు గ్రామ పరిధిలో ఉన్న ఎంపీఎల్ కంపెనీ విస్తరణ పనులను ఆపాలంటూ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అరూరి శ్రీశైలం అన్నారు. వెలిమినేడు గ్రామ పరిధి లో జనావాసాలకు సమీపంలో ఉన్న ఎంపిఎల్ ఉక్కు పరిశ్రమ నుండి విపరీతమైన వాయు కాలుష్యము,శబ్ద కాలుష్యము వలన ఇప్పటికే గ్రామ ప్రజలు తీవ్రమైన రోగాల బారిన పడుతున్నారు.నివాస సముదాయం జనావాసాలు 300 మీటర్ల దూరంలో ఉన్న ఈ కంపెనీ దూర ప్రాంతాలకు తరలించకుండ అదే ఫ్యాక్టరీలో ఉక్కు పరిశ్రమ సామర్థ్యం పెంచుటకు పర్యావరణ అనుమతులు కోరుతూ 19వ తేదీ శుక్రవారం ఉదయం 11.00 గం.లకు జరిపే ప్రజాభిప్రాయ సేకరణ ను ఆపాలని లేదంటే గ్రామ ప్రజలు ఐక్యంగా అడ్డుకుంటామని ఇప్పటికే వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు గ్రామ ప్రజలకు మద్దతు తెలిపాయని తక్షణమే పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెలిమినేడు గ్రామంలో ఎంపీఎల్ కంపెనీ విస్తరణను ఆపివేయాలని వెలిమినేడు గ్రామానికి చెందిన న్యూ ఆదర్శ యూత్ సభ్యులు కోరారు. జనవరి 19న జరిగే కంపెనీ విస్తరణను ఆపాలని కోరుతూ జిల్లా కలెక్టర్, ఆర్డీవో, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి, చిట్యాల ఎమ్మార్వోకి వినతిపత్రం అందించారు. కంపెనీల వల్ల వెలిమినేడు కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని, కంపెనీల నుంచి గ్రామాన్ని కాపాడాలన్నారు. ఎంపీఎల్ పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్తరించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు కొమ్మగొని భిక్షం, నాతి సతీష్, నాతి రాజు,ఎండీ ఇమ్రాన్,అరూరి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ వైపు చూస్తున్న కొమురయ్య

పీఎం మోడి ప్రభావంతో నే రాజకీయాల్లోకి



**సికింద్రాబాద్, విశాలభారతి:** దేశ భవిష్యత్తు విద్యాలయాల్లో బోధించే విద్యా బోధన పై ఆధారపడి ఉంది. నేటి పిల్లలే రేపటి భారత పౌరులు అని నాటి ప్రధాని నెహ్రూ చెప్పిన మాటలు తెరమీదకు వచ్చాయి. విద్యాలయాలను ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మల్క కొమురయ్య రాజకీయాల్లో కి అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమయ్యారు. బీజేపీ పార్టీ నుండి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మొదటి నుండి బీజేపీ పార్టీకోసం పరోక్షంగా పనిచేసిన ఆయన తాజాగా ప్రత్యేక్ష రాజకీయాల్లో కి వస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ తీసుకున్న నిర్ణయాలు, ఆయన పాలనీ తీరు తో దేశం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక శక్తిగా ఎదిగిందని స్పష్టం చేశారు. తనకు అవకాశం కల్పిస్తే బీజేపీ నుండి పోటీ చేస్తాన్నారు. కాగా మాజీ మంత్రి మల్లా రెడ్డి కూడా గతంలో మల్కాజిగిరి నుండి బీఆర్ఎస్ నుండి పోటీ చేసి గెలిచారు. కాగా మల్లా రెడ్డి దారిలోనే మల్కకొమురయ్య కుడా ప్రయాణం చేసేందుకు సిద్ధమయ్యారు. పల్లవిస్కూల్క్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ ఇంజనీరింగ్ కాలేజీలను సక్సెస్ ఫుల్ గా నడిపిస్తున్నారు. ఒక ఇంజనీర్ గా తన జీవితం ప్రారంభించిన ఆయన ఆతర్వాత గ్రీన్ ఎనర్జీ పథకాలను కూడా నిర్వహించారు.



## ప్రజలకు అందుబాటులో ఉండాలి


- ఎమ్మెల్యే లాస్యనందిత
- తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

**సికిద్రాబాద్, విశాలభారతి:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం 7 వ వార్డులోని తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే లాస్యనందిత సందర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ప్రజలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నిరుపేద రోగులకు నిరంతరం అందుబాటులో ఉండాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం అక్కడ చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆరోగ్యకేంద్రం ముందు చేపట్టబోయే షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే లాస్యనందిత భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లాస్యనందిత, డీఎంహెచ్ఓ రాజకుమారితో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ సభ్యులు శ్యాం కుమార్, వార్డు 7 బీఆర్ఎస్ ప్రెసిడెంట్ తేజ్ పాల్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పణ

**కొత్తూరు, విశాలభారతి:** ప్రభుత్వ భూమినికబ్జాదారుల చెర నుండి కాపాడి వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండలపార్టీ నాయకుడు జంగ నర్సింహా తదితరులు తహసీల్దార్ అయ్యప్ప కు బుధవారం వినతిపత్రం సమర్పించారు.నందిగామ మండల కేంద్రశివారులోని సర్వే నెంబర్ 1946లో కొంత ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారని, సర్వే చేసి అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కాపాడాలని వారు కోరారు.గతంలో అధికారంలో ఉన్న కొంతమంది ప్రజాప్రతినిధుల అండదండలు వీరికి ఉండటంతో వీరు స్వేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ,కుమారస్వామి గౌడ్, జంగ మల్లేష్,తడకల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.





## చెరువు శిఖాన్ని కాపాడండి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** అబ్దుల్లాపూర్ మెట్ మండలం తారామతి పేట్ గ్రామంలోని పోల్కమ్మ చెరువు శిఖం భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి, అక్రమంగా వేసిన రోడ్డును తీసివేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ మాట్లాడుతూ పోల్కమ్మ చెరువు నుండి రోడ్ వేశారని ఆర్డీవో, కలెక్టర్ కి ఫిర్యాదు చేసినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు, కుమ్మక్కై చెరువులు కుంటలు కబ్జాలు గురవుతున్న ఇరిగేషన్ అధికారులు తూతూమంత్రంగా కేసులు పెట్టి కబ్జాలు చేస్తున్న వారికి సంబంధం లేనట్టుగానే ఉంటున్నారు. ఈ విషయంలో అధికారులకు వెళ్లి దరఖాస్తు ఇచ్చిన ఫలితం ఉండట్లేదు కావున ఇరిగేషన్ మరియు రెవెన్యూ అధికారులు స్పందించి పోల్కమ్మ చెరువులో వేసిన రోడ్డుని వెంటనే తీసివేసి చెరువులు రక్షించాలని కోరారు. లేని యెడల ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శివకుమార్, యాదయ్య తదితరులు ఉన్నారు.

# అయోధ్యకు హైదరాబాద్ లడ్డు

- 1265 కేజీల లడ్డును రూపొందించిన హైదరాబాదీ
- తొలిసారిగా భారీ లడ్డూను తయారు చేసిన నాగభూషణం రెడ్డి




**సికింద్రాబాద్, విశాలభారతి:** వినాయక చవితి సందర్భంగా బొజ్జ గణపయ్యకు ఉండ్రాలులు ఇష్టమని భక్తులు తయారు చేసి ఆయకు అప్పగిస్తారు లేదా మండపానికి అందజేస్తారు. దేవాలయంకు వెళ్లితే పూజారి భక్తులకు తీర్థ ప్రసాధాలను అందిస్తారు. తాజాగా దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటికి సీతారాములు అక్షింతలు పంపిణీ చేస్తున్నారు. అయోద్య రామాలయ నిర్మాణ ట్రస్టు ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. కానీ దేవాలయానికి వెళ్లే ముందుకు దేవుడునికి ఏం ఇస్తా భాగుంటుందని అనుకున్నాడో ఏమో కానీ సీతారాములను మెప్పించేందుకు ప్రయత్న చేశారు నగరానికి చెందిన నాగభూషనం. అందులో భాగంగా దేవుడికి, రామభక్తులను మెప్పించేందుకు భారీ లడ్డును తయారు చేశారు. సికింద్రాబాద్ కంటోన్మంట్ కు చెందిన శ్రీరామ్ క్యాటరర్స్ యజమాని నాగభూషణం రెడ్డి అయోధ్య రామయ్యకు భారీ లడ్డును బహుకరించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక వెస్ మారెడ్ పల్లి నివాసముంటున్న ఆయన అయోధ్య రామయ్య మందిర నిర్మాణం ప్రారంభించి నేటికి 1265 రోజుల సందర్భాంగా అదే మొత్తం లో లడ్డు ను తయారు చేయించారు. అందుకోసం మరో రాష్ట్రానికి చెందిన చెఫ్ ను కూడా పిలిపించారు. మొత్తం 25 మంది 36 గంటల పాటు కష్టపడి ఈ భారీ లడ్డును తయారు చేశారని వివరించారు. అయోధ్య లో కొలువుదీరి రామయ్యకు ఏం ఇస్తే భాగుంటుందని అనున్నాడో ఎమో.. తనకంటూ ఓ ప్రత్యేక ఉండాలని నిర్ణయం తీసుకు నాగభూషణం భారీ లడ్డును తయారు చేసి అయోధ్య రామయ్యకు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. విషయాన్ని తన భార్య కుటుంబ సభ్యులతో చర్చించి లడ్డు తయారు చేసేందుకు పూనుకున్నారు. అందుకోసం 350 కిలోల శనగపిండి, 700 కిలోల చక్కెర, 40 కిలోల నెయ్యి, 40 కిలోల కాజు, 30 కిలోల కిస్మిస్, 15 కిలోల బాదం, 10 కిలోల పిస్తా, 32 గ్రాముల కుంకుమ పువ్వు వినియోగించినట్లు నాగభూషణం రెడ్డి వెల్లడించారు. ఈ లడ్డూను అయోధ్యరామయ్య గుడికి 50 మీటర్ల దూరంలో ప్రదర్శనకు ఉంచుతామని, ఆతర్వాత ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ప్రసాదంగా పంచుతారని ఆయన చెప్పారు.



## ఎల్ వో సి అందజేసిన ఎమ్మెల్యే

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన సుమలత కు అనారోగ్యం కారణంగా మెదడు కి ఆపరేషన్ చేయాల్సి ఉండటంతో వైద్య ఖర్చుల విషయాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం కి తెలపగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సిఎం సహాయ నిధి నుండి రూ.3లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కుని మంజూరు చేయించి బాధితురాలు సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కాటం వెంకటేశం మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ ఉప సర్పంచ్ నూతి సత్య శ్రీ వెంకటేశం జడల చిన్న మల్లయ్య సాగర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో దరఖాస్తులకు ఆహ్వానం



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష కొరకు నోటిఫికేషన్ వెలువడిందని TSWRS /JC(B), COE, ఇబ్రహీంపట్నం, ప్రిన్సిపాల్ ఎ. సత్యనారాయణ తెలిపారు. ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చే నెల 11 తేదీన పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల అర్హత 202324 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. పాస్ ఫొటో, కులం సర్టిఫికెట్, బోనోఫైడ్ సర్టిఫికెట్ తో, రూ.100/ రుసుము చెల్లించి, నెట్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ. సత్యనారాయణ సూచించారు. అదేవిధంగా COE కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ కొరకు ఉన్న దరఖాస్తు గడువు ఈనెల 20 వరకు పొడిగించారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుంది

### చెర్కూర్ ఈదమ్మ, మాంధాత ఉత్సవాల్లో గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి, విశాల భారతి:** ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలం చెరుకూరు గ్రామంలో ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదినాల్లో నిర్వహించే ఈదమ్మ, మాంధాత, మాతంగి ఉత్సవాల్లో బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా ఈదమ్మ, మాందాతలకు గోలి శ్రీనివాస్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు భీమయ్య గౌడ్, మైసయ్య , ఉప సర్పంచ్ నర్సింహ, నాయకులు సత్యం, అలీలోద్దిన్, శ్రీను నాయక్, ప్రశాంత్ , రాంచందర్ గౌడ్, లాలయ్య ,అంబేద్కర్ సంఘం నాయకుడు శ్రీను, నారాయణపూర్ సర్పంచ్ అంజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## దినదిన అభివృద్ధి పథంలో హుస్నాబాద్ పాలకేంద్రం..

- రోజుకు వెయ్యి లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తూ ద్వితీయ స్థానంలో..
- సొంత బిల్డింగ్ నిర్మాణంతోపాటు వాటర్ ప్లాంట్ ఏర్పాటు..
- 560మంది పాల ఉత్పత్తిదారుల సహకారంతో మరింత ముందుకు...

**హుస్నాబాద్, విశాల భారతి:** హుస్నాబాద్ కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకారంతో దినదిన అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని ఆ డెయిరీ అధ్యక్షుడు కాయిత బాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ పాల కేంద్రం అధ్యక్షుడు బాల్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా హుస్నాబాద్ బీఎంసీయు పరిధిలో హుస్నాబాద్ పాలకేంద్రం రోజుకు దాదాపు వెయ్యి లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తూ రెండో స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. పాల ఉత్పత్తిదారుల సహకారంతో, కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వరరావు అండతో హుస్నాబాద్ లో పాల కేంద్రానికి సొంత భవనం నిర్మాణంతో పాటు, వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు బాల్ రెడ్డి తెలిపారు. 1989లో ఏర్పాటైన పాల కేంద్రం ఏలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా ముందుకు వెళుతుందన్నారు. హుస్నాబాద్ పాల కేంద్రంలో 10మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ డైరీ అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రోత్సహిస్తుందని, చైర్మన్ రాజేశ్వరరావుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సమావేశంలో పాల కేంద్రం డైరెక్టర్లు కాశవేణి మల్లేశం, గుర్రాల సంజీవరెడ్డి, బొలిశెట్టి శివయ్య, బొలిశెట్టి సమ్మయ్య,జాల జ్యోతి కుమార్,చెన్నవేని సమ్మయ్య, ఆకుల శ్రీనివాస్, మాధవి,బి జాన్ బి,పాల కేంద్రం కార్యదర్శి మంద జనార్ధన్ రెడ్డి,గూడ రామ్ రెడ్డి, ఆకుల హనుమయ్య తదితరులు ఉన్నారు.



## పారిశుద్య కార్మికులను సన్మానించిన రాంబాబు

**భీమదేవరపల్లి, విశాల భారతి:** వీరభద్ర స్వామి భద్రకాళి సమేత బ్రహ్మోత్సవాలలో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి ఆలయ ముఖ్య అర్చకుడు మొగిలి పాలెం రాంబాబు బుధవారం గ్రామపంచాయతీ సిబ్బందికి శాలువాతో సత్కరించి దేవుని ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రపరుస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చేస్తున్న పారిశుద్య కార్మికులకు ఆయన వంతుగా సాకారం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా ప్రజాసేవలో, గ్రామ సేవలో సుభిక్షంగా ఉండాలని వీరభద్ర స్వామి భద్రకాళి సమేత దేవి ఆశీస్సులు ఉండాలని ఆశీర్వదించినట్లు ఆయన తెలిపారు.



## వైభవంగా వీరభద్ర సమేత భద్రకాళి త్రిశూల స్నానం

**భీమదేవరపల్లి, విశాల భారతి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం వీరభద్ర సమేత భద్రకాళి త్రిశూల స్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రాలు, వీరభద్ర స్వామి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. వీరభద్రస్వామి అవాహనతో వీరముచ్చు వంశస్థులు డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేశారు. త్రిశూలేశ్వరుని సహితంగా పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానమాచరిస్తే శత్రుపీడ, శరీరపీడ, రోగ బాధలు తొలగిపోతాయని వేదపండితులు తెలిపారు.

**నేడు అగ్నిగుండాలు, స్వామివారి గ్రామ పర్యటన:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున అగ్నిగుండాల కార్యక్రమం జరుగుతుంది. శరభ శరభ అంటూ భక్తులు నిప్పు కణికలపై భక్తిపారవశ్యంతో నడువనున్నారు. అదే రోజు సాయంత్రం స్వామివారి గ్రామ పర్యటన ఉంటుంది. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో కిషన్ రావు తెలిపారు.

## సీతమ్మ జన్మస్థలం నుంచి భారీ కానుకలు

### కానుకలతో పాటు కొత్త వినతులు తెరపైకి



**బీహార్:** అయోధ్యలోరామయ్య ప్రభువు కొలువు దీరే వేళ తన అత్త గారింటి నుంచి సీతామాత జన్మస్థలమైన ...బిహార్ లోని మిథిల జిల్లా సీతామఢీ నుంచి భారీగా కానుకలు అయోధ్యకు చేరుకున్నాయి. హిందూ పురాణాల ప్రకారం త్రేతాయుగంలో అయోధ్య నగరంలో శ్రీరామచంద్రుడు జన్మించాడు. ఇప్పుడు కలియుగంలో రామజన్మభూమి అయోధ్యలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు భారత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మహోన్నత కార్యక్రమం కోసం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారు. అయోధ్యలో జనవరి 22న శ్రీరాముడు కొలువు దీరేసమయంలో సీతామాత జన్మస్థలమైన బిహార్ లోని మిథిల జిల్లా సీతామఢీ నుంచి భక్తులు భారీగా కట్నకానుకలు తెచ్చారు. అయోధ్యలో దివ్య, భవ్య రామాలయం ప్రారంభోత్సవమౌతున్న సందర్భంగా సీతామాత జన్మస్థలమైన బిహార్ మిథిల జిల్లా సీతామఢీ నుంచి భక్తులు భారీగా కట్నకానుకలు తెచ్చారు. రాముడి అత్తారింటి నుంచి రావాల్సిన కానుకలన్నింటిని సీతామఢీ వాసులు ట్రక్కుల్లో తీసుకొచ్చారు.. అయోధ్యలో కొలువుదీరనున్న శ్రీ రామచంద్రుడికి కానుకల వర్షం కురుస్తోంది. దేశ విదేశాల నుంచి బహుమతులు వస్తున్నాయి. వాటన్నింటిలోకి ప్రత్యేకంగా నిలుస్తున్నది మాత్రం శ్రీరాముడి అత్తమామల ఇంటి నుంచి వచ్చే కానుకలే. సీతామాత స్వస్థలమైన బిహార్‌లోని సీతామఢి నుంచి కానుకలతో కూడిన ట్రక్కులు అయోధ్య చేరుకున్నాయి. వాటిలో ధన, ధాన్య, కనకాది వస్తువులన్నీ ఉన్నాయి. అలాగే దుస్తులు, దుప్పట్లతో పాటు ఓ కొత్త జంటకు కావాల్సిన గృహోపకరణ వస్తువులు కూడా ఉన్నాయి. ఆ కానుకలు తీసుకుని అయోధ్య చేరుకున్న సీతామఢి వాసులు.. రామజన్మభూమి తరహాలోనే సీతాజన్మస్థలాన్ని కూడా అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే ప్రారంభమైందన్న విషయం అందరికీ తెలుసు. కానీ కొన్ని దశాబ్దాల క్రితమే ఆలయ నిర్మాణానికి అవసరమైన స్తంభాలు, ఇతర వస్తువులు సిద్ధమయ్యాయి. అయోధ్యలో ఆ ప్రాంతాన్ని రామ జన్మభూమి కార్యశాలగా పిలుస్తారు. అయోధ్యను సందర్శించడానికి వచ్చే ప్రతీ ఒక్కరూ ఆ కార్యశాలను సందర్శించకుండా తిరిగి వెళ్లరు. బండరాళ్లను అందమైన స్తంభాలుగా, ఆకృతులుగా మరల్చిన కార్యశాల వచ్చే ప్రతీ యాత్రికుణ్ణి, భక్తుణ్ణి మంత్రముగ్ధులను చేసిన ఆ కార్యశాలలో రూపుదిద్దుకుంటున్నాయి శిలాకృతులు.. శ్రీరాముడికి అందుతున్న కానుకలతో పాటు కొత్త వినతులు కూడా తెరపైకి వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రామాయణ్ సర్క్యూట్‌లో సీతామఢి పునౌరా ధామ్ కూడా ఉంది. ఇక్కడే సీతా కుండ్, సీతా వాటిక, లవ్‌కుశ్ వాటిక ఉన్నాయి. అయోధ్యలో రామాలయ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో బిహార్‌లోని నితీశ్ ప్రభుత్వం ఇటీవలే ఈ క్షేత్ర అభివృద్ధి కోసం 72 కోట్ల రూపాయలు కేటాయించింది. పెద్ద ఎత్తున పనులు చేపట్టింది. అయోధ్య తరహాలో సీతామాత జన్మభూమిని అభివృద్ధి చేయాలని బిహార్ వాసులు కోరుతున్నారు. సీతామఢి ప్రాంతాన్ని కూడా అయోధ్య మాదిరిగా తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు.



## అయోధ్యకు భద్రాద్రి ముత్యాల తలంబ్రాలు..

### భద్రాచలం నుంచి బయలుదేరిన శ్రీ రామ రథం..

**ఖమ్మం:** దేశంలోనే దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం నుండి ఖమ్మం జిల్లా బీజేపీ నేత నంబూరి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ రామ రథాన్ని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ ప్రాంభించారు. ముందుగా రామానుజ జీయర్ స్వామి విగ్రహంతో పాటు ఎంతో ప్రాముఖ్యత గల భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ముత్యాల తలంబ్రాలను రామాలయ అంతరాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రాచలం నుండి అయోధ్యకు బయలుదేరిన శ్రీరామ రథం ఈ నెల 21 తేదీన అయోధ్య చేరుకుంటుంది. ఈ నెల 22 న అయోధ్యలో రామ భక్తులకు ఎంతో విశిష్టత గల భద్రాచలం ముత్యాల తలంబ్రాలను అందించనున్నారు. భద్రాచలం ముత్యాల తలంబ్రాల ప్రాముఖ్యతను వివరిస్తూ 20 వేల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు అందించి, రాముడు వనవాసం చేసిన భద్రాచలం పరిసర ప్రాంతంతో పాటు రామాలయం విశిష్టత తెలియ పరిచే ముఖ్య ఉద్దేశ్యంతో శ్రీరామ రథం యాత్ర ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఢిల్లీలో 2 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత

### మరి కొద్దిరోజుల పాటు ఇదే వాతావరణం



**ఢిల్లీ:** దేశ రాజధానిలో చలి తీవ్రత కొనసాగుతోంది. చలిగాలులు వణికిస్తోన్నాయి. ఎముకలు కొరికేంతటి చలిని చవి చూస్తోన్నారు ఢిల్లీవాసులు. ఇదే పరిస్థితి మరి కొద్దిరోజుల పాటు కొనసాగుతుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని సూచించింది. కొద్ది రోజులుగా ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో ఉష్ణోగ్రత భారీగా పడిపోతూ వస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 10 నుంచి 6 డిగ్రీల వరకూ నమోదైన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇప్పుడిది తుడిచి పెట్టుకుపోయింది. సఫ్దర్ జంగ్ ఏరియాలో రెండు రోజుల కిందట డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. ఈ తెల్లవారు జామున ఇప్పుడదే ప్రాంతంలో ఉష్ణోగ్రత 1.4 డిగ్రీకి పడిపోయింది. 17 సంవత్సరాల తరువాత కనిష్ఠ ఉష్ణోగ్రత ఈ స్థాయికి పడిపోవడం ఇదేతొలిసారి. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహా సౌత్ ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో 4 నుంచి 2 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. సామాన్యులకు చలి నుంచి రక్షణ కల్పించడానికి ఢిల్లీ ప్రభుత్వం నైట్ షెల్టర్లను ఏర్పాటు చేసింది. వారికి అవసరమైన బ్లాంకెట్లు, ఇతర సదుపాయాలను కల్పిస్తోంది. దట్టమైన పొగమంచు వీడట్లేదు. 50 మీటర్ల దూరం వరకూ ఏదీ కనిపించని విధంగా మంచుతెరలు కమ్ముకుంటోన్నాయి. దీనివల్ల విమానాల రాకపోకలకు తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. విజిబిలిటీ లోపించడం వల్ల సమయానికి అవి ల్యాండ్ కావట్లేదు. టేకాఫ్ తీసుకోవట్లేదు. ఫలితంగా ప్రయాణికులు గంటల కొద్దీ జాప్యాన్ని ఎదుర్కొంటోన్నారు.



# నా సామిరంగ' చిత్రాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు

**: థాంక్ యూ మీట్ లో కింగ్ నాగార్జున అక్కినేని**

కింగ్ నాగార్జున అక్కినేని హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'నా సామిరంగ'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకునిగా పరిచయమైన ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి హై బడ్జెట్‌తో నిర్మించారు. పవన్ కుమార్ సమర్పించారు. నాగార్జునకు జోడిగా అషికా రంగనాథ్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అల్లరి నరేష్, రాజ్ తరుణ్, మిర్న మీనన్, రుక్సర్ ధిల్లాన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా ఆదివారం (జనవరి 14న) ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి పర్ఫెక్ట్ సంక్రాంతి సినిమాగా ఘన విజయాన్ని సాధించింది. ప్రేక్షకులు, అభిమానులు, విమర్శకులు ప్రసంశలు అందుకొని 'సంక్రాంతి కింగ్' గా అలరిస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ థాంక్ యూ మీట్ ని నిర్వహించింది. థాంక్ యూ మీట్ లో కింగ్ నాగార్జున అక్కినేని మాట్లాడుతూ.. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. మమ్మల్ని ఎంతగానో ఆదరించిన తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. చాలా ఆనందంగా వున్న నా అభిమానులందరికీ ధన్యవాదాలు. ప్రేక్షకులు, అభిమానుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన, వారి అనందం చూస్తుంటే నాకు చాలా అనందంగా, తృప్తిగా వుంది. మా యూనిట్ లో అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అందరూ ప్రేమతో, సంక్రాంతికి విడుదలవ్వాలి, పెద్ద విజయం సాధించాలనే సంకల్పంతో పని చేశారు. ఇప్పుడు ఫలితం కూడా అంత గొప్పగా వచ్చింది. ఈ సినిమాకి బిగ్గెస్ట్ స్టార్ కీరవాణి గారని మొదటి నుంచి చెబుతున్నాను. ఇప్పుడు అదే మాట చెబుతున్నా. అద్భుతమైన పాటలు, నేపథ్య సంగీతం ఇచ్చారు. ఆయనకి కృతజ్ఞతలు. కొత్త దర్శకుడు విజయ్ బిన్నీ చాలా హార్డ్ వర్క్ చేశారు. రోజుకి కేవలం మూడు గంటలు మాత్రమే నిద్రపోయేవారు. మిగతా సమయం అంతా ఈ ప్రాజెక్ట్ పైనే ఉండేవారు. ఇది హ్యూజ్ మూవీ. చాలా పాత్రలు వున్నాయి. ఇంతమందిని, ఇన్ని పాత్రలని చాలా అద్భుతంగా హ్యాండిల్ చేశాడు. తనకి చాలా గొప్ప భవిష్యత్ వుంటుంది. డివోపీ శివేంద్ర హనుమాన్ చేశాడు. అందులో తన వర్క్ గురించి అందరూ గొప్పగా చెబుతున్నారు. నిర్మాత చిట్టూరి గారు ఈ కథ వినగానే సూపర్ హిట్ అవుతుందని చెప్పారు. ఆయన చెప్పినట్లే అయ్యింది. ఆయన గొప్ప ప్రోత్సాహం అందించారు. మీడియా మిత్రులు చాలా పాజిటివ్ వైబ్స్ ఇచ్చారు. అందరికీ ధన్యవాదాలు.



# రెబల్ స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబో "రాజా సాబ్" ఫస్ట్ లుక్, టైటిల్ రిలీజ్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్న క్రేజీ మూవీకి "రాజా సాబ్" అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ ను ఇవాళ అనౌన్స్ చేశారు. మోస్ట్ అవేటెడ్ మూవీగా రెబల్ ఫ్యాన్స్, ఫిల్మ్ లవర్స్ "రాజా సాబ్" కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూఛిబొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్ లో "రాజా సాబ్" సినిమాను దర్శకుడు మారుతి రూపొందిస్తుండటంతో ఈ సినిమా మీద అందరిలో క్యూరియాసిటీ ఏర్పడుతోంది. "రాజా సాబ్" ఫస్ట్ లుక్ పోస్టర్ కలర్ ఫుల్ గా డిజైన్ చేశారు. ఈ పోస్టర్ లో వింటేజ్ లుక్ లో, లుంగీ కట్టుకున్న ప్రభాస్ ఆకట్టుకుంటున్నారు. సరదాగా, రొమాంటిక్ గా సాగే క్యారెక్టర్ లుక్ లో ప్రభాస్ ను చూడటం అభిమానులతో పాటు ఫిల్మ్ లవర్స్ అందరికీ ఫ్రెష్ ఫీల్ కలిగిస్తోంది. "రాజా సాబ్" ఫస్ట్ లుక్ పోస్టర్ లోనే ఒక కలర్ ఫుల్ సినిమా చూడబోతున్నామనే ఇంప్రెషన్ కలిగించారు దర్శకుడు మారుతి. ఆయన గతంలో "భలే భలే మగాడివోయ్", "మహానుభావుడు", "ప్రతి రోజు పండగే" వంటి బ్లాక్ బస్టర్ హిట్స్ ఇచ్చి తన టాలెంట్ ప్రూవ్ చేసుకున్నారు. మారుతి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ను కొత్తగా సిల్వర్ స్క్రీన్ మీద ప్రెజెంట్ చూపిస్తాడనే నమ్మకం అందరిలో ఏర్పడుతోంది. డార్లింగ్ ఫ్యాన్స్ ప్రభాస్ ను ఎలా స్క్రీన్ మీద చూడాలనుకుంటున్నారో, డైరెక్టర్ మారుతి అలా "రాజా సాబ్" మూవీని డిజైన్ చేసి పిక్చరైజ్ చేస్తున్నారు. ధమాకా, కార్తికేయ 2 వంటి బ్యాక్ టు బ్యాక్ సూపర్ హిట్ సినిమాలతో టాలీవుడ్ లో దూసుకెళ్తున్న ప్రెస్టీజియస్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ "రాజా సాబ్" సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో ఎక్కడా రాజీపడకుండా గ్రాండ్ గా ప్రొడ్యూస్ చేస్తోంది. "రాజా సాబ్" సినిమా తమ సంస్థలో ఒక మెమొరబుల్ మూవీగా మిగిలిపోయేలా నిర్మిస్తోంది.






మెగాస్టార్ చిరంజీవి గత సంక్రాంతికి 'వాల్తేరు వీరయ్య'తో తన అభిమానులకు, ప్రేక్షకులకు ఫుల్ మీల్ ఫీస్ట్ అందించారు. మెగాస్టార్‌కు ఈ సంవత్సరం పండుగకు థియేట్రికల్ రిలీజ్ లేనప్పటికీ మెగాస్టార్ మాగ్నమ్ ఓపస్ #Mega156 మేకర్స్ సినిమా టైటిల్‌ను స్పెల్‌బైండింగ్ గ్లింప్స్ ను లాంచ్ చేయడం ద్వారా పర్ఫెక్ట్ సంక్రాంతి ప్రజంటేషన్ అందించారు. గ్లింప్స్ మనల్ని అద్భుత ప్రపంచంలోకి తీసుకెళుతుంది. అక్కడ ఎవరో మ్యాజికల్ బాక్స్ ని లాక్ చేస్తారు, అది అనుకోకుండా పడిపోయింది. ఇది బ్లాక్ హోల్ గుండా వెళుతుంది. ఒక గ్రహశకలం లోకి క్రాష్ అవుతుంది. అటువంటి అనేక ఆటంకాలు అడ్డంకులు తర్వాత, ఆ మ్యాజికల్ బాక్స్ చివరకు భూమికి చేరుకుంటుంది. ఇది ఒక పెద్ద హనుమాన్ విగ్రహంతో సింబాలిక్ గా చూపించారు. ఒక బిలం భూమిపైకి దూసుకువస్తుంది. అయినప్పటికీ మ్యాజిక్ బాక్స్‌కు ఏమీ జరగదు. చివరి గా ఈ చిత్రం టైటిల్ 'విశ్వంభర' గా రివిల్ అవుతుంది. మెగా మాస్ బియాండ్ ది యూనివర్స్ అనేది మన ఊహలకు అందనిది, మ్యాజికల్ బాక్స్ ప్రయాణం మనం చూడబోయే గొప్ప సినిమా అనుభవంపై కొంత స్పష్టతను ఇస్తుంది. వీఎఫ్ఎక్స్ వర్క్ అత్యున్నతంగా వుంది. మరీ ముఖ్యంగా 'విశ్వంభర' అనే టైటిల్ చాలా ఎఫెక్టివ్ గా అనిపిస్తుంది.

# సూర్య 'కంగువ' సెకండ్ లుక్ రిలీజ్


నేషనల్ అవార్డ్ విన్నర్, స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కంగువ'. ఈ సినిమాను భారీ నిర్మాణ విలువలతో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్నాయి. దిశా పటానీ హీరోయిన్ గా నటిస్తోంది. చారిత్రక నేపథ్యంతో బ్లాక్ బస్టర్ డైరెక్టర్ శివ రూపొందిస్తున్నారు. పాన్ వరల్డ్ మూవీగా మొత్తం పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతి పండుగ శుభాకాంక్షలతో ఇవాళ 'కంగువ' సినిమా నుంచి సెకండ్ లుక్ రిలీజ్ చేశారు. ఈ సెకండ్ లుక్ పోస్టర్ లో సూర్య యుద్ధవీరుడిగా కనిపించడంతో పాటు ట్రెండీ లుక్ క్యారెక్టర్ లోనూ సర్ ప్రైజ్ చేస్తున్నారు. 'విధి కాలం కంటే బలమైనది. గతం, వర్తమానం, భవిష్యత్ ...కాలం ఏదైనా నలుదిక్కులా మార్మోగే పేరు ఒక్కటే..కంగువ ' అంటూ సెకండ్ లుక్ సందర్భంగా మేకర్స్ క్యాప్షన్ ఇచ్చారు. సెకండ్ లుక్ ఇంట్రెస్టింగ్ గా ఉండి 'కంగువ'పై మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్, మెస్మరైజ్ చేసే సూర్య స్క్రీన్ ప్రెజెన్స్ తో 'కంగువ' త్వరలోనే సిల్వర్ స్క్రీన్ మీదకు గ్రాండ్ గా రాబోతోంది.





# ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల గ్రాస్ మార్క్ చేరుకున్న హనుమాన్

యువ కథా నాయకుడు తేజ సజ్జ టైటిల్ రోల్‌లో నటించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుండి వచ్చిన మొదటి చిత్రం "హనుమాన్" దేశీయ మరియు విదేశీ మార్కెట్‌లలో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌కు చెందిన కె నిరంజన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించారు మరియు పాన్ ఇండియా స్థాయిలో ప్రమోషన్స్ నిర్వహించారు. సంక్రాంతి స్పెషల్ గా జనవరి 11 ప్రీమియర్స్ బ్లాక్బస్టర్ టాక్ తో విడుదల అయిన ఈ చిత్రం అదే జోరును కొనసాగిస్తోంది. ఈ చిన్న సినిమా స్టార్ హీరో సినిమాలా అద్భుతాలు చేస్తూ రోజురోజుకు భారీ వసూళ్లను రాబడుతోంది. ఈ చిత్రం నిజానికి అన్ని చోట్లా టాప్ ట్రెండింగ్ లో ఉంటూ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుంది.ఈ స్కేల్ బడ్జెట్ సినిమా కు ఇది భారీ విజయం అనే చెప్పాలి. "హనుమాన్" సినిమా ఓవర్సీస్ లో 3 మిలియన్ మార్క్ ని క్రాస్ చేసి అక్కడ ట్రిపుల్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది.



# అనన్య పాండే టోన్డ్ శిరులు

బాలీవుడ్ నటి అనన్య పాండే ఇటీవల తన తాజా చిత్రం `ఖో గయే హమ్ కహాన్` విజయాన్ని అందుకుంది. ఇందులో అనన్య నటనకు మంచి పేరొచ్చింది. పాన్ ఇండియా మూవీ లైగర్ డిజాస్టర్ రిజల్ట్ తర్వాత బిగ్ రిలీఫ్ ఇది. తన సహనటులు ఆదర్శ్ గౌరవ్ , సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి అనన్య ఆనందకరమైన సక్సెస్ వేడుకలో పాల్గొన్నారు. ఈ చిత్రం వారి సినీ ప్రయాణంలో ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచింది.n అనన్య పాండే ఈ సక్సెస్ పార్టీలో హెడ్ టర్నర్ గా మారింది. దీనికి కారణం బ్లాక్ ఫ్రాక్ లో యూనిక్ నెస్ తో కట్టి పడేయడమే. పార్టీలో కళ్లన్నీ అనన్యపైనే అంటే అతిశయోక్తి కాదు. అనన్య పాండే బ్లాక్ పిన్‌స్ట్రిప్డ్ కో-ఆర్డ్ సెట్ .. జిమ్మీ చూ హీల్‌స్‌లో చాలా స్పెషల్ గా ఉంది అంటూ కితాబు అందుకుంది. ప్రస్తుతం ఈ అందమైన ఫోటోషూట్ యువతరంలో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అనన్య పాండే చివరిసారిగా ఆయుష్మాన్ ఖురానాతో కలిసి `డ్రీమ్ గర్ల్ 2`లో కనిపించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. తదుపరి `ఖో గయే హమ్ కహాన్` మరో చక్కని విజయం అందించింది. అర్జున్ వరైన్ సింగ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో అనన్య అద్భుతంగా నటించిందని కితాబు దక్కింది. ఖో గయే హమ్ కహాన్‌తో కల్తీ లేని స్నేహం నేపథ్యంలో రూపొందించిన సినిమా. ఇది సోషల్ మీడియాల్లో పరిచయమైన 20 ఏళ్ల లోపు ఉన్న ముగ్గురు స్నేహితుల గురించిన కథాంశమిది. కమింగ్-ఆఫ్-డిజిటల్-యుగం కథ.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.